ప్రజాశక్తి

ఆదివారం 23 ఫిబ్రవరి 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు





# సిఎం వద్ద సమస్యలు ఏకరువు



- ధరల పతనంపై గోడు వెళ్లబోసుకున్న మిర్చి రైతులు
- వరదల వల్ల నాణ్యత తగ్గిందన్న వ్యాపారులు
- క్వింటాళ్ ధర రూ.11,781 కంటే తగ్గితే కేంద్రం కొనుగోలు చేస్తుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

మిర్చి రైతులు తమ సమస్యలను సిఎం చంద్రబాబు వద్ద ఏకరవు పెట్టారు. శనివారం సాయంత్రం వెలగపూడిలోని సచివాలయంలో రైతులు, వ్యాపారులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎవరి వాదనలు వారు వినిపించారు. మిర్చి రైతులను ఆదుకుంటామని, వ్యాపారులు, ఎగుమతిదారులు సహకరించాలని సిఎం చంద్రబాబు సూచించారు. క్వింటాళ్ మిర్చి ధర రూ.11,781 కంటే తగ్గితే కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. పలువురు రైతులు మాట్లాడుతూ మిర్చి సాగుకు పెట్టుబడి భారీగా పెరగగా ఆ స్థాయిలో తమకు ఆదాయం రావడం లేదని తెలిపారు. నల్లతామర తెగులుతో పంట నాణ్యత తగ్గడంతో పాటు దిగుబడి తగ్గిపోతోందని రైతులు తెలిపారు. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకూ ఖర్చు అవుతోందని వివరించారు. ఎన్నో వ్యయప్రయాసాలతో యార్డుకు పంటను తెస్తే ఉదయం పూట నిర్ణయించిన ధర మళ్లీ మధ్యాహ్నానికి తగ్గిపోతుందన్నారు. వ్యాపారులను ప్రశ్నిస్తే క్వాలిటీ సరిగా లేనందువల్లే తగ్గిస్తున్నామని వ్యాపారులు సమాధానం చెప్తున్నారని, ఉదయం ఉన్న క్వాలిటీ మధ్యాహ్నానికే ఎలా తగ్గుతుందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. యార్డుకు టిక్కీలు తేవాలంటే బాడిగకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని, యూనియన్‌లో లేని లారీలను బాడిగకు తీసుకొస్తే వారిని మిగతా లారీ యజమానులు బెదిరించి, కేసులు పెడుతున్నారని వివరించారు. 2016-17లో ఇచ్చిన విధంగా మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం అమలు చేయాలన్నారు.

వ్యాపారులు మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు కంటెయినర్ నుంచి మిర్చి ఎగుమతులను అనుమతించాలన్నారు. చైనా, శ్రీలంక, సింగపూర్, బంగ్లాదేశ్, ఇండోనేషియాకు సాగుతాయని ఎగుమతి దారులు వివరించారు. అయితే ఈ ఏడాది ఆయా దేశాలకు ఎగుమతులు తగ్గడం వల్ల రాష్ట్రంలో మిర్చికి కొంత ధర ▶ 2లో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

## వరికపూడిసెలకు ఈ బడ్జెట్‌లోనే నిధులివ్వాలి


- అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులతో కలిసి మాట్లాడదాం
- ప్రాజెక్టుపై శాసన మండలి, ఇతర వేదికలపైనా ప్రస్తావించా
- ఇకమీద జరిగే పోరాటాల్లోనూ నా భాగస్వామ్యం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

**ప్రజాశక్తి - వినుకొండ**

పల్నాడు జిల్లాకు వరికపూడిసెల ఎంతో ముఖ్యమని, దీనిపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మంత్రులతో చర్చిద్దామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. వరికెపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి రానున్న అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్ కేటాయించి పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తూ రైతు, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి పిడిఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించగా లక్ష్మణరావు మాట్లాడుతూ పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టు కోసం దశాబ్దాలగా ప్రజా పోరాటం జరుగుతోందన్నారు. పర్యావరణ అనుమతులు వచ్చినా పాలకులు నిధులు కేటాయించలేదన్నారు. వరికపూడిసెల అంశాన్ని ▶ 2లో

## జనం కోసం మాట్లాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

- నిస్వార్థంగా పని చేస్తున్న లక్ష్మణరావుకు విశేష స్పందన
- ఓటమి భయంతోనే కూటమి అసత్య ఆరోపణలు
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



విలేకర్లతో మాట్లాడుతున్న రమాదేవి

**ప్రజాశక్తి - తెనాలి**

నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతుల సమస్యలపై మండలిలో గళం విప్పేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం అవసరమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రచారం నిమిత్తం తెనాలికి శనివారం వచ్చిన ఆమె స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఐద్వా, సిఐటియు, ఉపాధ్యాయ, ఎన్జీవో సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు విజయం అందరి లక్ష్యంగా చెప్పారు. అధ్యాపకునిగా పనిచేస్తూ పిడిఎఫ్ ఎమ్మెల్సీగా ఎన్నికైన నాటి నుంచి నిస్వార్థంగా ప్రజాసేవకే అంకితమై పనిచేశారన్నారు. గత పదేళ్లుగా టిడిపి, వైసిపి స్వార్థపూరిత రాజకీయాల కోసం ఎమ్మెల్సీ వ్యవస్థని భ్రష్టు పట్టించే స్థాయికి దిగజారయని విమర్శించారు. విద్యారంగంలో సమస్యలపై అవగాహన ఉన్న అభ్యర్థులే పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా పోటీ చేయాల్సి ఉన్నా, రాజకీయ లబ్ధి కోసం టిడిపి రంగంలోకి దిగిందన్నారు. లక్ష్మణరావుకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభిస్తోందని, అందుకే ప్రత్యర్థులు ఓటమి భయంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, దిగజారుడు రాజకీయాలకు ▶ 2లో

## 28 నుండి కుడికాల్వ పరిధిలో వారాబందీ

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గడం, వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నాగార్జున సాగర్ జలాశయం లింగంగుంట్ల డివిజన్ ఇఇ డి.వెంకటసుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సాగర్ కుడి కాల్వల పరిధిలో వారాబందీని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆరుతడి పంటల కాలం పూర్తయ్యే వరకు ప్రతి 15 రోజుల్లో 9 రోజులు లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని కాల్వకు నీరు సరఫరా చేస్తామని, 6 రోజులు నిలిపేస్తామని తెలిపారు. ఈ నెల 28న లింగంగుంట్ల డివిజన్ పరిదిలోని 10 ఆర్ చిలకలూరిపేట మేజర్, పెదనందిపాడు బ్రాంచ్ కాల్వ, అద్దంకి బ్రాంచ్ కాల్వలకు నీటి సరఫరా ఆపేస్తామని పేర్కొన్నారు. రైతులు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని, వృథాను అరికట్టాలని కోరారు.

## కిడ్నాప్, దాడి కేసులో ఇద్దరు అరెస్టు

**నిందితుల్లో వైసిపి కౌన్సిలర్ - త్వరలో మరో ఇద్దరి అరెస్టు : సిఐ**

**ప్రజాశక్తి - తెనాలి**

అప్పు ఇవ్వలేదనే కారణంగా వ్యక్తిని కారులో తీసుకెళ్లి దాడి చేసిన ఘటనలో ఇద్దర్ని త్రీ టౌన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారిలో ఒకరు వార్డు కౌన్సిలర్ కావటం విశేషం. దీనిపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ ఎస్ రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. స్థానిక ▶ 2లో





## కొడుకుతో కలిసి కోర్టులో లొంగిపోయిన గుండా సాంబశివరావు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

నరసరావుపేట విజయలక్ష్మి టౌన్‌షిప్ భాగస్వామిగా ఉన్న ప్రముఖ వడ్డీ వ్యాపారి గుండా సాంబశివరావు, ఆయన కుమారుడు అనిల్ గుంటూరు కోర్టులో శనివారం లొంగిపోయారు. ప్రముఖ న్యాయవాది మేళం శ్రీకృష్ణ ద్వారా గుంటూరు స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు ఎదుట హాజరయ్యారు. విజయలక్ష్మి టౌన్‌షిప్ ఆర్థిక లావాదేవీల విషయంపై బాధితులు రాజ్యలక్ష్మి పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ కేసులో గుండా సాంబశివరావు ఆయన కుమారుడు అనిల్ నిందితులుగా ఉన్నారు. సాయిసాధన చిట్స్, విజయలక్ష్మి టౌన్‌షిప్‌లో భాగస్వామిగా ఉన్న పుల్లారావు ఇప్పటికే కోర్టులో లొంగిపోయిన విషయం తెలిసిందే. సామాన్యుల వద్ద రూ.వందల కోట్ల వరకు దోచుకున్న ఈ కేసులో తమకు న్యాయం జరిగే వరకూ చట్ట పరంగా పోరాడతామని బాధితులు చెబుతున్నారు. పుల్లారావు కేసు ఇప్పటికే సిట్‌కు అప్పజెప్పిన విషయం తెల్సిందే.

## మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలి

ఆర్‌డికు గోదావరి-పెన్నా అనుసంధానంలో భూములు కోల్పోయే రైతుల వినతి 2 లో



మంగళగిరిలో రెడ్ బుక్ డే కార్యక్రమంలో నాయకులు

## కమ్యూనిస్టు ప్రణాళికపై ప్రతిఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కమ్యూనిస్టు ప్రణాళికపై ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు అన్నారు. శనివారం రాత్రి మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య అధ్యక్షు వహించారు. రాఘవులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాజ్యం.. విప్లవంతో ప్రపంచానికి దశ దిశ జరిగిందని అన్నారు. కార్మిక వర్గం అధికారంలోకి వస్తేనే కార్మికుల రాజ్యం ఏర్పడుతుందని అన్నారు. భారతదేశంలో ఉన్న అన్ని బూర్జువ పార్టీలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కొరకే పని చేస్తాయని అన్నారు. అనంతరం రెడ్ బుక్ డే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై కమలాకర్, సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, పట్టణ నాయకులు ఏం చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో పుతుంబాక భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ బుక్ డే కార్యక్రమం నిర్వహించారు. "రాజ్యము- విప్లవము"అనే బుక్ ను సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అనుముల లక్ష్మేశ్వర్ రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండు వందల సంవత్సరాల క్రితం కార్ల మార్క్స్ మార్క్స్ స్టు, అదనపు విలువ సిద్ధాంతాన్ని కనిపెట్టారని అన్నారు. ఈ సిద్ధాంతాన్ని కార్మిక వర్గానికి అన్వయించడంతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కార్మిక వర్గ పోరాటాలు జరిగి దోపిడి రాజ్యాలను కూల దోసి వామ పక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయని అన్నారు. ఆస్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ సిద్ధాంతాన్ని, వామపక్ష భావ జాలాన్ని మరింత విస్తృత పరచడానికి ఈ రెడ్ బుక్ డే ను నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి విమల, నాయకులు కె శివ దుర్గారావు, జె రాజ కుమార్, జి రజిని, పి ప్రభాకర్,జి సుసులోవ్ షేక్ సైదులు పాల్గొన్నారు.

## కోటప్పకొండ సందర్శకులకు సౌకర్యాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ లో జరుగనున్న ఉత్సవాలలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నరసరావుపేట కలెక్టరేట్ లో కోటప్పకొండ తిరునాళ్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభలు తరలింపుకు ఎటువంటి అంతరాయం కలగకుండా రోడ్లను తీర్చిదిద్దాలన్నారు. ప్రభల రాకపోకలకు విద్యుత్ వైర్లు తగలకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణ మరియు మంచినీటి సరఫరాను పకడ్బందీగా నిర్వహించాలని ఎప్పటికప్పుడు పడిన వ్యర్థాలను తీసే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు అదేవిధంగా క్యూలైన్లో ఉండే భక్తులకు మంచినీళ్ల ప్యాకెట్లు అందజేయాలని కొండ క్రింద నుండి కొండపైకి వచ్చే భక్తులకు తరలించేందుకు ఘాట్ రోడ్డుకు అనువైన అవసరమైన బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డిఓ కె. మధులత, రోడ్లు భవనాల శాఖ అధికారి రాజా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ పీ.అరుణ్ బాబు ఎస్.పి కె.శ్రీనివాసరావు కోటప్పకొండ వద్ద ఏర్పాట్లను అధికారులతో పరిశీలించి తగు సూచనలు సలహాలు తెలిజేశారు.

## మార్చి 24,25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

**జయప్రదం చేయాలని వర్కింగ్ కమిటీ సమావేశంలో యూనియన్ నేతల పిలుపు**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బ్యాంకింగ్ రంగంలోని అన్ని కేడర్‌లలో తగిన రిక్రూట్‌మెంట్‌లను కోరుతూ మార్చి 24,25 తేదీల్లో బ్యాంకర్లు సమ్మె చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశం ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది. స్థానిక అరండల్‌పేటలోని ఒక హోటల్‌లో శనివారం రెండు రాష్ట్రాల నుండి యూనియన్ ఆఫీస్ బేరర్లు కార్యవర్గ సభ్యులు ఈ సమావేశానికి హాజరు అయ్యారు.అన్ని బ్యాంకుల్లో లక్షలాది ఖాళీలు ఉన్నందున స్వీపర్లు, సబార్డినేట్ క్యాడర్ సిబ్బంది క్లరికల్ సిబ్బందిని పెద్ద సంఖ్యలో నియమించాల్సిన అవసరం ఉందని ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు కె.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యవర్గ సమావేశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల రక్షణ కోసం ఎఐబిఇఎ బ్యానర్ కింద నిరంతరం పోరాడుతున్న బ్యాంకు ఉద్యోగులను ఆయన అభినందించారు. క్లరికల్ సిబ్బంది, సబార్డినేట్ కేడర్, స్వీపర్‌ల నియామకాలు, 5 రోజుల బ్యాంకింగ్ తదితర డిమాండ్‌లతో బ్యాంకింగ్ పరిశ్రమలో జరుగుతున్న ఆందోళనకు సిపిఐ మద్దతు, సంఘీభావం తెలియజేశారు. అవార్డు స్టాఫ్ క్యాడర్‌లో ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఆయన ఖండించారు. గౌరవ అధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, నాగార్జున యూనివర్సిటీ రాజనీతి శాస్త్రాల విభాగం ప్రొఫెసర్ ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి, యూనియన్ జనరల్ సెక్రటరీ కృష్ణారావు, నాయకులు ఎంఎస్‌కుమార్, రవిచంద్రారెడ్డి, భాషా, కిషోర్ తదితరులు ప్రసంగించారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

## మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలి

**ఆర్‌డిఒకు గోదావరి-పెన్నా అనుసంధానంలో భూములు కోల్పోయే రైతుల వినతి**

ప్రజాశక్తి - నకరికల్లు

గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భూములు కోల్పోయే రైతులకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేటు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం నరసింగపాడు గ్రామంలో భూములు కోల్పోయే రైతులు సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్ రెడ్డికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. కొంతమంది రైతులు పూర్తిస్థాయిలో భూములు మొత్తం కోల్పోతున్నారని, వాటికి బహిరంగ మార్కెట్ ధర రూ.40 లక్షల ప్రకారం నష్టపరిహారం అందజేసేలా చర్యలు తీసుకొని, తమ సమస్యను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాలని ఆర్డిఓ ను కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నరసింగపాడు గ్రామంలోని రైతులు గోదావరి-పెన్నా నదుల అనుసంధానంలో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) గ్యాస్ పైపు లైన్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వ మార్కెట్ ప్రకారం భూముల విలువ రూ.4 లక్షలు ఉండగా, రిజిస్ట్రేషన్ విలువలు పెంచడంతో రూ.6 లక్షలుగా రేటు పెరిగిందని తెలిపారు. భూములు కోల్పోయే వారికి 2.5 రెట్లు పెంచి నష్టపరిహారం అందజేస్తామని అన్నారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో అమరావతి మండలంలో 2 పంపు హౌస్ లు, క్రోసూరు, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ఒకటి చొప్పున నిర్మిస్తున్నట్లు తెలిపారు. నరసింగపాడులో తీసుకోవాలనుకుంటున్న భూమి పశుసంవర్ధక గణాంక శాఖకు చెందిన పంపు హౌస్ కాలువ కింద 341.90 ఎకరాలు, నకరికల్లులో 283 ఎకరాలు, గుండ్లపల్లి గ్రామంలో 78 ఎకరాలుగా మొత్తం 704.48 ఎకరాలు భూమి కోల్పోతున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు భూములు కోల్పోయే రైతుల సమస్యలు, డిమాండ్లు, అభ్యంతరాల గురించి తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆర్టీవో తెలిపారు. రైతులు ప్రభుత్వం అందజేసే నష్టపరిహారాన్ని ఒప్పుకుంటే పంపు హౌస్ నిర్మాణానికి కావలసిన నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తాహసిల్దార్ పుల్లారావు, ఇరిగేషన్ శాఖ ఏఈలు చల్లా శ్రీను, రేవతి, సౌజన్య ,ప్రమీల, రైతులు పాల్గొన్నారు.



భూములు కోల్పోయే రైతుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్ రెడ్డి

## సిఎం వద్ద సమస్యలు ఏకరువు

(మొదటి పేజీ తరువాయి)

తగ్గిందన్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో వచ్చిన వరదల కారణంగా, పురుగుమందులు ఎక్కువగా వినియోగించడం వల్ల, క్వాలిటీ కొంత దెబ్బతినడం వల్ల డిమాండ్ తగ్గుతుందని వివరించారు. కోల్డ్ స్టోరేజీల్లో కూడా గత పంటకు సంబంధించిన నిల్వలు అధికంగా ఉండటం వల్ల కొత్తగా వచ్చిన పంట నిల్వ చేసుకునేందుకు వీలు లేకుండా పోయిందని, తద్వారా రైతులు నేరుగా యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారని వ్యాపారులు తెలిపారు. రైతులకు ఆర్థిక అవసరాలు వెంటాడుతున్న కారణంగానే వెంటనే పంటను విక్రయిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పండే 60 శాతం మిర్చి విదేశాలకు ఎగుమతి అవుతుందని, వివిధ దేశాలకు సరఫరా చేసే 410 మంది ప్రధాన ఎగుమతి దారుల్లో ప్రస్తుతం 250 మంది మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారని వివరించారు. కృష్ణపట్నం కంటెయినర్ టెర్మినల్ ద్వారా మిర్చి కంటెయినర్‌లను అనుమతించడం లేదని, ఈ కారణంగా మద్రాసు పోర్టుకు వెళ్లడం ద్వారా రవాణా అధికమయ్యాయని వివరించారు. గుంటూరులోని స్పైస్ పార్కులో కనీస సదుపాయాలు లేవని వ్యాపారులు వివరించారు. అటు రైతులు, ఇటు వ్యాపారుల సమస్యలు విన్న సిఎం చంద్రబాబు వీటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## వరికపూడిసెలకు ఈ బడ్జెట్‌లోనే నిధులివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అనేకసార్లు శాసనమండలిలో, జిల్లా పరిషత్ సమావేశాల్లో ప్రస్తావించానని, అయితే పాలకులకే చిత్తశుద్ధి లేదని చెప్పారు. ప్రాజెక్టు సాధన పోరాటంలో తాను ఉంటానని ఉద్ఘాటించారు. రూ.1260 కోట్లు కేటాయించాల్సి ఉందని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 15 రోజులు పాటు జరుగుతున్నాయని, రైతులు, ప్రజా సంఘాల నాయకులతో వెళ్లి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మరోమంత్రి లోకేష్‌తో చర్చిద్దామని చెప్పారు. రైతు, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ సమావేశాలలో వరికెపూడిసెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వై.వెంకటేశ్వర్లు, వి.కోటనాయక్, టి.ఆంజనేయులు, మూర్తి, లూకా, ఎంఎన్ ప్రసాద్, రూబెన్, వీరాంజనేయులు, కృష్ణనాయక్, రాంజీ నాయక్, కె.హనుమంత్‌రెడ్డి, ఆర్.ప్రసన్నకుమార్, బి.వెంకటేశ్వర్లు, బి.శ్రీనునాయక్, వి.పేరయ్య, ఫిరోజ్, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## జనం కోసం మాట్లాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

(మొదటి పేజీ తరువాయి)

ఇదొక నిదర్శనమని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి, డీఎస్సీ హామీని అమలు చేయలేదని, కూటమి అభ్యర్థిని గెలిపిస్తే కనీసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా ఉండదని అన్నారు. ప్రాథమిక విద్యావ్యవస్థను పూర్తిగా బ్రష్టు పట్టించే పనిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని విమర్శించారు. విజ్ఞత గలిగిన ఓటర్లు అన్ని వర్గాల సమస్యలపై గళం విప్పే లక్ష్మణరావును గెలిపించాలని, బ్యాలెట్ నమూనాలో 23వ సంఖ్యగా ఉన్న ఆయనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. సిఐటియు నాయకులు కె.బాబు ప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో, కొల్లిపర పంచాయతీలో సిబ్బందికి పిఎఫ్ సమస్యపై లక్ష్మణరావు అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించారని తెలిపారు. ఉన్నత వ్యక్తిత్వానికి, ప్రజా సమస్యలపై పోరాట పటిమకు లక్ష్మణరావు వ్యక్తిత్వం అర్థం పడుతుందని అన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు భావన్నారాయణ పాల్గొన్నారు.

## కిడ్నాప్, దాడి కేసులో ఇద్దరు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

బాలాజీరావు పేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి టింబర్ డిపో నిర్వహిస్తున్నాడు. అతను నివాసం ఉండే ప్రాంతంలోనే 33 వ వార్డు కౌన్సిలర్ మొగల్ రహమత్ బేగ్ నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ కొంతకాలంగా స్నేహంగా ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మొగల్ రహమత్ బేగ్ తనకు కొంత నగదును అప్పుగా ఇవ్వాలని మస్తాన్‌వలిని కోరాడు. దానికి అతను నిరాకరించడంతో కక్ష పెంచుకుని బెదిరించి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల ఐదున టింబర్ డిపో వద్ద ఉన్న మస్తాన్‌వలిని తన మిత్రుడు షేక్ హుమాయున్ క్రిస్టితో కలిసి బలవంతంగా కారులో ఎక్కించుకున్నాడు. మరికొంత దూరం వెళ్లగా షేక్ ఇర్ఫాన్ అలియాస్ హైదరాబాద్, షేక్ రెహమాన్ అలియాస్ అబ్దుల్ రెహమాన్ కూడా కారు ఎక్కారు. బాధితుడిని చంపుతామని బెదిరిస్తూ కారులోనే దాడి చేశారు. కారును కొలకలూరు, కాజీపేట, తక్కెళ్లపాడు మీదుగా బైపాస్ రోడ్డులోకి వెళ్లిన తర్వాత బాధితుని ఫోన్ నుంచి రూ.5 వేలు చెల్లించి వాహనానికి ఆయిల్‌ను, వారికి మద్యాన్ని కొన్నారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే చంపుతామని బాధితుడిని తీవ్రంగా బెదిరించారు. వారి దాడిని తట్టుకోలేక మస్తాన్‌వలి డబ్బు ఇస్తానని ఒప్పుకోవడంతో తెనాలి తీసుకొచ్చి డబ్బు తేవాల్సిందిగా చెప్పి అతనిని వదిలిపెట్టారు. దాదాపు అర్ధరాత్రి వేళ వారి చెర నుంచి బయటపడిన బాధితుడు నేరుగా ఆసుపత్రిలో చేరి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు 3 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ప్రకాశరావు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో ఇరువురు నిందితులైన షేక్ ఇర్ఫాన్, షేక్ హుమాయున్ క్రిస్టిని అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు చెప్పారు. నిందితులు ఉపయోగించిన కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సై ప్రకాశరావు, సిబ్బంది పి.మురళి, కె.బాబురావు, ఎస్.జయకర్, ఎం.శ్రీనివాసరావు, డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

## ఆయిల్ ప్యాకింగ్ యూనిట్లలో తనిఖీలు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని ఆయిల్ రీప్యాకింగ్ యూనిట్‌లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. కల్తీలు జరుగుతున్నాయనంటూ సామాజిక మాధ్యమాల్లో కథనాల నేపథ్యంలో జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 8 మంది ఫుడ్ సేఫ్టీ అధికారులు 8 విభాగాలుగా ఏక కాలంలో చేసిన దాడుల్లో 4 రైస్ బ్రాన్, 2 సన్ ఫ్లవర్, 3 శనగ నూనె, 1 పామోలిన్ ఆయిల్ నమూనాలను సేకరించారు. వీటిని నాణ్యతా పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని నాచారం స్టేట్ ఫుడ్ ల్యాబోరేటరీకి పంపుతామని ఎన్.పూర్ణచంద్రరావు తెలిపారు. నాణ్యతా లోపాలుంటే ఆహార భద్రత- ప్రమాణాల చట్టం 2006 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలు నిత్యం చేస్తుంటామని, నిబంధనలు మీరితే సహించబోమని అన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌పై పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ప్రతి పోలింగ్‌స్టేషన్ లోపల, బయట వెబ్ కెమెరా ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు అభ్యర్థులు ప్రచారం నిలిపి వేయాలన్నారు. పోలింగ్ ఏజెంట్లకు ఐడి కార్డులు ఇస్తామని, ఏజెంట్‌గా నియమించబడే వ్యక్తి లోకల్ బాడీలో మెంబర్‌గా, ప్రభుత్వ శాఖలలో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగిగా , ప్రభుత్వ పెన్షనర్‌గా ఉండకూడదని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాలకు చెందిన వ్యక్తి అయివుండాలని, పోలింగ్ రోజు గంట ముందుగా రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ఐడి ప్రూఫ్, డిక్లరేషన్, ఫారం -10 ఇవ్వాలని తెలిపారు.పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఎటువంటి ప్రచారం చేయకూడదని, ఎండాకాలం దృష్ట్యా పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో గొడుగు లాంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్ట్రానికి గాడ్జెట్స్ పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో వినియోగించరాదనని తెలిపారు. మార్చి 3న ఏసీ కాలేజిలో ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్ల కోసం ఈనెల 28న సాయంత్రం 4గంటలలోపు రెండుసెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌంటింగ్‌కు 28 టేబుల్స్ వేయడం జరుగుతుందని, మూడు షిఫ్ట్‌లుగా నిర్వహించడం జరుగుతుందని, ఏజెంట్‌ను ఏషిఫ్ట్‌కు ఏ టేబుల్‌కు కేటాయిస్తారో తెలియజేయాలన్నారు. రిటర్నింగ్ ఆఫీసర్ టేబుల్ దగ్గరకు కౌంటింగ్ ఏజెంట్‌గానీ, ఎలక్షన్ ఏజెంట్‌నుగానీ, అభ్యర్థిని గాని అనుమతిస్తారని తెలిపారు. సమావేశంలో జేసీ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్ఓ ఖాజావలి, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి పాల్గొన్నారు.





ఎమ్మెల్యేకి వినతి పత్రం అందచేస్తున్న వెంకట మాల్యాద్రి

## వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి ప్రత్తిపాడు:

వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా అధ్య క్షులు చొప్పర వెంకట మాల్యాద్రి శనివారం ప్రత్తిపాడు నియోజక వర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బూర్ల రామం జనేయులు కలిసి వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ గురించి అసెంబ్లీ లో ప్రస్తావన చేయాలని వినతిపత్రం అంద జేశారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు చొప్పారా మాల్యాద్రి మాట్లాడుతూ భారతదేశ ఆదిమ గిరిజన తెగకు చెందిన వాల్మీకి బోయలు నార్త్ ఇండియాలో ఎస్సీలుగాను, సౌత్ ఇండియా లో ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి 5 జిల్లాల్లో, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలో నేటికి ఎస్టీ రిజర్వేషన్ కలిగి ఉన్నామన్నారు. మిగిలిన ఉమ్మడి ఎనిమిది జిల్లాలైన చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపూర్, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరులో ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను బీసీలుగా మార్చారని తెలిపారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించి, వాల్మీకి ఎస్టీ పునరుద్ధరణ చేసి వాల్మీకులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో చొప్పర రఘు, చొప్పర ఫణి, కామినేని సాయికష్ణ, నల్లబోతుల చిరంజీవి, కామినేని అఖిల్, వంక దారి తరుణ్ పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

## పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండలం చివలూరు గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ. 4200లు నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## సచివాలయాన్ని తహశీల్దారు తనిఖీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక ఐతానగర్‌లోని ఒకటో సచివాలయాన్ని ఎమ్మార్వో కెవి గోపాలకృష్ణ శనివారం పరిశీలించారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్థానికుల నుంచి వచ్చిన అర్జీలపై స్పందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని సచీవలయం సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-ఈపూరు

రోడ్డు ప్రమాదంలో ఎ-ముప్పాళ్ళ గ్రామానికి చెందిన విద్యార్థి జె రఘు శంకర్ చెందిన మృతి చెందిన సంఘటన మంగళగిరి సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జాస్తి బుచ్చారావు దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు జె రఘుశంకర్ గుంటూరు సమీపంలోని చౌడ వరం వద్ద గల ఆర్‌విఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువు తున్నాడు. కాలేజీ ముగిసిన తర్వాత టిఫిన్ చేసేందుకు ద్విచక్ర వాహనంపై రఘుశంకర్ మరో ఇద్దరు మిత్రులతో కలిసి మంగళగిరి సమీపంలోని హోటల్‌కు వెళ్లాడు. టిఫిన్ చేసి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న రఘు శంకర్ అదుపుతప్పి కింద పడటంతో వెనక వస్తున్న కారు ఢీ కొట్టింది. సంఘ టనలో రఘుతలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించగా స్వగ్రామం ముప్పాళ్లకు తరలించారు. తోటి స్నేహితులు, విద్యార్థులు ముప్పాళ్ళ గ్రామానికి చేరుకుని రఘు శంకర్ మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



జాస్తి రఘు శంకర్ (ఫైల్ ఫోటో)

**నోటీసు**
**మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో**
**D.O.P. No.759/2024**

బిట్వీన్:
సండూరి మల్లేశ్వరి @ రాచల్ @ రాహెల్ ....పిటీషనరు
మరియు
సండూరి శివ @ జాన్ మార్క్ ...రెస్పాండెంటు,
సండూరి శివ @ జాన్ మార్క్,
తండ్రి . బ్రహ్మం @ విశ్వరూపాచారి,
సాకిన్: చల్లా వారి పాలెం గ్రామం, గుంటూరు (రూరల్ మం & జిల్లా).

పై నెంబరు D.O.P.ని పిటీషనరు అయిన సండూరి మల్లేశ్వరి @ రాచల్ @రాహెల్, రెస్పాండెంటుతో కలిసి జీవించడానికి మరియు పిటీషనరుని కాపురానికి తీసుకొని వెళ్ళమని కొరుచూ దాఖలు చేసిన డి.ఒ.పి.లో రెస్పాండెంట్ అయిన మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:11-03-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదారోజున ఉ.గం.10-30ని.ల.కు మీరు స్వయంగా గాని, మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:11-03-2025

**యడ్లపల్లి హరి హర రాయలు,**
**పిటీషనరు తరపు న్యాయవాది,**
**గుంటూరు, సెల్. 93941 58099**

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్), సత్తెనపల్లి.**
**O.S. No. 36/2020**

Between:-
బూస సూర్యనారాయణరెడ్డి .... వాది
అండ్
షేక్ బషీర్ అహ్మద్ ... ప్రతివాది
**ప్రతివాది :**
షేక్ బషీర్ అహ్మద్, తండ్రి : పిరన్ సాహెబ్, గవర్నమెంట్ ఎంప్లాయి, పిహెచ్‌సి, ప్రత్తిపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు గల దావాలోని వాది, ప్రతివాది అయిన మీపై ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేయగా సదరు దావాలోని ప్రతివాదియైన మీ హాజరు నిమిత్తం ది. 27-2-2025న వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా తేదీన పై తెలిపిన కోర్టువారి ఎదుట ఉదయం 10-00 గం.లకు మీరు గానీ, మీ వకీలు గారు గానీ హాజరు కాగలరు. లేని యెడల మీ దావా వ్యవహారం పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
**వాయిదాతేది : 27-2-2025**

**శ్రీ బి.అమరయ్య నాయక్,**
**అడ్వకేట్,**
**సత్తెనపల్లి.**

**మహారాజశ్రీ వినుకొండ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గారి కోర్టులో**
**O.S. No. 8/2023**

Between:-
మేఘవత్ శ్రీను నాయక్ ... వాది
AND
ఉప్పలపాటి వెంకట సుబ్బారాజు మరియు మరికొందరు ఇతరులు ... ప్రతివాదులు
To,
1) ఉప్పలపాటి వెంకట సుబ్బారాజు S/o అప్పల రాజు,
2) ఉప్పలపాటి శ్రీలక్ష్మి w/o వెంకటసుబ్బారాజు ,
Both are R/o డోర్ నెం. 4-39, టెలిఫోన్ ఎక్స్చేంజ్ కాలనీ, తాడేపల్లి విలేజ్, గుంటూరు జిల్లా.

పై నంబర్ దావాలో వాది మీ పైన దావా దాఖలు చేయగా సదరు దావాలో కోర్టు ద్వారా ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసు పంపించిననూ మీకు ముట్టనందున శ్రీకోర్టువారి ఆర్డర్ ప్రకారం సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా పేపరు పబ్లికేషన్ నిమిత్తం ది. 3-03-2025 వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30ని॥లకు మీరు స్వయంగా కానీ, ప్లీడరు ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల ఎక్స్‌పార్టీ చేసి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
**వాయిదా ది.3-03-2025**

**ఇట్లు**
**పంగులూరి అంజనేయులు చౌదరి,**
**అడ్వకేట్, నరసరావుపేట,**
**సెల్ నెం: 9849314557**

**దావా సమన్లు**
**IN THE COURT OF THE XII ADDL. DISTRICT- CUM-FAMILY COURT JUDGE :: GUNTUR**
**F.C.O.P.No.543 / 2023**

Between
Smt. Siddu Santhi & 2 others ...Petitioners
and
Siddu Ravi Teja .... Respondent
To:
Siddu Ravi Teja, S/o. Uma Maheswara Rao, R/o.D.No.133-11-2960, 8th line, Mother Teresa Colony, Reddypalem, Guntur.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు సమన్లు substituted service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేస్తూ, మీ యొక్క హాజరు నిమిత్తం ది.06-03-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజున ఉదయం గం॥ 10-30 ని॥ లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ వకీలుగారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యడల శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేదీ : 06-03-2025.

**బి. రమేష్**
**టి. వసంతలక్ష్మీ**
**వాది తరపు న్యాయవాదులు**
**సెల్ నెం. 8247615617.**

**దస్తావేజులు పోయినవి**

గొర్రె నాగజ్యోతి, భర్త : గొర్రె శ్రీనివాసరావు, గుంటూరుజిల్లా, గుంటూరుసిటీ, డొంకరోడ్డు, 1వ లైను, కాకుమాను వారితోట, 5వ లైను, కాపురస్తులు డోర్ నెం. 7-8-24 నివాసం. నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా, గుంటూరుజిల్లా సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పొందిన, గుంటూరు డి.నెం. 332, విస్తీర్ణం 72 చ॥గజాలు గల దస్తావేజు నెం. 4176/2022 గల స్థలానికి చెందిన ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ కొరకు నా స్వగృహం నుండి అరండల్‌పేట వైపు ఆటోలో వెళుతుండగా మార్గమధ్యంలో ఎక్కడో జారిపడిపోయినది. వెనక్కి వెళ్ళి వచ్చినదారిలో వెతికినా దొరకలేదు. కావున దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

**ఇట్లు**
**గొర్రె నాగజ్యోతి**
**కాకుమానివారితోట 5వ లైన్,**
**గుంటూరు. సెల్ : 9666110107**

**దావా సమన్లు**
**మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
**ఓ.యస్.నెం.462/2024**

బిట్వీన్:
భాష్యం సుధాకర్ ....వాది
మరియు
చోప్పారపు వెంకట కృష్ణ. .... ప్రతివాది,
చోప్పారపు వెంకట కృష్ణ, తండ్రి.వెంకటేశ్వర రావు, దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగి,స్టేషన్ సూపరింటెండెంట్, బండారుపల్లి రైల్వే స్టేషన్, తాడికొండ(మం), గుంటూరు జిల్లా, నివాస డోర్ నెం.45-9-330, వడ్డూరివారి వీధి, కొత్తపేట, గుంటూరు.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీకోర్టువారి ద్వారా సమన్లు పంపిచినను మీకు ముట్టనందున శ్రీ కోర్టువారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది.21-03-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ. గం.10.30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ,మీ అడ్వకేటు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారిచే దావా మీపరోక్షముగా విచారించి తీర్మానించబడును.

(శ్రీకోర్టువారిఉత్తర్వులప్రకారము)
వాయిదాతేది:21-03-2025

**వి.తిరుమల రావు,**
**వాది తరపు న్యాయవాది,**
**గుంటూరు, సెల్:9848135350**

## జ్ఞానమ్మ క్లబ్ ఆధ్వర్యంలో విద్య, ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

జ్ఞానమ్మ క్లబ్ ఆధ్వర్యంలో గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను క్లబ్ సభ్యులు సందర్శించి విద్య, ఆరోగ్య విష యాలపై అవగాహన కల్పించారు. జంక్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్ రోజ్, కామర్స్ విభాగాధిపతి జె.ప్రమీలరాణి పాల్గొన్నారు.



విద్యార్థులతో జ్ఞానమ్మ క్లబ్ సభ్యులు

## హక్కు పత్రాలు లేకుండానే పూలింగ్‌కు దేవాలయ భూమి

### అధికారుల తీరుపట్ల కమిటీ అసంతృప్తి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎటువంటి హక్కు పత్రాలు లేకుండానే రాజధానిలో భాగమైన పెనుమాక తూర్పు వీధి రామాలయం (రెడ్ల రామాలయం)కు సంబంధించి 3.30 ఎకరాల భూమిని రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులు 2015లో అమరావతి రాజధానిలో భాగంగా అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ పూలింగ్ కింద సిఆర్‌డిఎ అధికారులకు ఆఘమేఘాల మీద ఇచ్చేశారు. ఈ భూమికి సంబంధించి సిఆర్‌డిఎ అధికారుల వద్ద ఎటువంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు గానీ, అధారాలుగానీ లేకపోవడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. 1920లో ఈ రామాలయానికి సంబంధించి కొంత భూమిని కొనుగోలు చేసి దాని మీద వచ్చే ఆదాయంతో ధూపదీప నైవేద్యాలకు వినియోగించాలని గ్రామానికి చెందిన మేకా నాగిరెడ్డి కుమారుడు కోటిరెడ్డి, హనుమారెడ్డి, లక్ష్మారెడ్డి, కళ్లం వీరారెడ్డి కుమారుడు వెంకటరెడ్డి గ్రామంలోని సర్వే నెంబర్ 317లో 2.44 ఎకరాలు, సర్వే నెంబరు 273లో 0.86 ఎకరాలు వారి పేర్ల మీద మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయింది. అప్పటి నుంచి ఈ భూమి మీద వచ్చే ఆదాయంతో గుడికి సంబంధించి అర్చకుల జీతాలు, ధూపదీప నైవేద్యాలకు అయ్యే ఖర్చు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం అమరావతి రాజధానిలో 34 గ్రామాలతో ఎపిసిఆర్‌డిఎ ఏర్పాటు చేసింది. విజయవాడ గొల్లపూడి లోని రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులు పెనుమాక రాముల వారి గుడి భూమిపై ఎటువంటి హక్కు పత్రాలు లేకుండానే పూలింగ్‌కు ఇచ్చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏటేటా వస్తున్న కౌలు సుమారు రూ.20 లక్షలు దేవాదాయ శాఖ జమ చేసుకుంటుంది. ఎటువంటి హక్కు పత్రాలు లేకుండా దేవదాయ శాఖ సిఆర్‌డిఎకు ల్యాండ్ పూలింగ్‌కు ఎలా ఇచ్చిందనేది జవాబు దొరకని ప్రశ్నగా ఉంది. ప్రస్తుతం రామాలయం కమిటీ సభ్యులుగా మేకా అంకమారెడ్డి, కళ్లం శివారెడ్డి, అల్లు శ్రీనివాసరెడ్డి, బండి సుమంత్ రెడ్డి, కళ్లం మహేశ్వరరెడ్డి ఉన్నారు. ఇటీవల కమిటీ సభ్యులు గొల్లపూడిలోని రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కమిటీ అధీనంలో ఉన్న భూములను సిఆర్‌డిఎకు అప్పగించడం అన్యాయమని అందులో పేర్కొన్నారు. పెనుమాకలోని దేవాలయ భూమిని తమకు అప్పగించాలని కోరారు. దీని కోసం ఎంతకైనా పోరాడతామని తెలిపారు.

## రేపు పవర్ లిఫ్టింగ్ పోటీలు

**ప్రజాశక్తి-ఈపూరు**

మండలంలోని ఎ.ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల, మహిళల పవర్ లిఫ్టింగ్ పోటీలతోపాటు బెస్ట్ ఫిజిక్ పురుషుల పోటీలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు శనివారం తెలిపారు. ఈ పోటీల్లో యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన వారు వచ్చేనెల 17-20 తేదీల్లో యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ శ్రీనగర్‌లో జరిగే అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. బెస్ట్ ఫిజిక్ పురుషుల పోటీలో ఎంపికైన వారు వచ్చేనెల 8 నుండి శంకరాచార్య యూనివర్సిటీలో పోటీలకు హాజరవుతారన్నారు.



## ఎన్నికల నిర్వహణపై శిక్షణ

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ సిబ్బంది నిబంధనల ప్రకారం సజావుగా పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఒ మురళి ఆదేశించారు. ఈనెల 27వ తేదీన ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులకుపై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లోని డాక్టర్ గుర్రం జాషువా సమావేశ మందిరంలో రెండో విడత శిక్షణను శనివారం నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సామగ్రి స్వీకరించడం నుంచి పోలింగ్ అనంతరం తిరిగి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను సమర్పించే వరకూ ప్రతి అంశం గురించి వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానం సంక్లిష్టంగా ఉంటుందని, ఓటు వేసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు నమోదు చేసి, బ్యాలెట్ బాక్సులో ఓటు వేసే విధానం గురించి స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. చెల్లని ఓట్లను గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్‌డిఒలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, పివోలు, ఏపీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం

**ప్రజాశక్తి - మాచర్ల రూరల్, సత్తెనపల్లి**





ప్రజా సమస్యలపై పాలక ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును ఎంఎల్సిగా గెలిపించేందుకు గ్రాడ్యూయేట్ ఓటర్లు సిద్ధం కావాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ కోరారు. పలు వ్యాపార సంస్థల వద్ద, ప్రైవేటు కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.మహేష్ పాల్గొన్నారు. కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ప్రచారం చేశారు. చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా నాయకులు ఎ.వీరబ్రహ్మాం మాట్లాడుతూ ప్రభుత్వాలు విస్మరించిన అనేక ప్రజా సమస్యలను కెఎస్ లక్ష్మణరావు శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్మిక, కర్షక, ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్స్, స్కీం వర్కర్లు తదితర సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారని చెప్పారు. పలు ఉద్యమాల్లో ప్రత్యక్షంగానూ పాల్గొన్నారని చెప్పారు. అయన్ను మరోసారి గెలిపించాలని కోరారు. నాయకులు డి.పుల్లారావు, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రజలందరి సమస్యలపైనా పోరాడాము



చిలకలూరిపేటలో నమూనా బ్యాలెట్ ఆవిష్కరణ.



వినుకొండలోవిలేకర్లతో మాట్లాడుతున్నలక్ష్మణరావు

- కరోనాతో మరణించిన ఉపాధ్యాయుల పిల్లల కారుణ్య నియామకాల కోసం కృషి
- సిపిఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యమం
- అరెస్టులు, కేసులకు భయపడకుండా ప్రజాపక్షం
- వ్యక్తిగత విమర్శలు కాదు.. విధానపరంగానే పిడిఎఫ్ ముందుకు
- ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

**ప్రజాశక్తి - వినుకొండ**

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్లు, అంగన్వాడీలు, ఆశాలు, రైతులు, కౌలు రైతులు, మహిళలు తదితర అన్ని వర్గాల సమస్యలను శాసన మండలిని వేదికగా చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్. లక్ష్మణరావు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వినుకొండకు వచ్చిన ఆయన పుతుంబక వెంకటపతి భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాతలు ప్రత్యేక ప్రయోజనాల కోసం శాసనమండలి ఏర్పాటు చేస్తే కార్మిక, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు అనాదిగా ఎన్నికల కావటం సంప్రదాయంగా వస్తోందన్నారు. అయితే నేడు అధికార పార్టీలు శాసనమండలిలోకి కూడా చొచ్చుకు వచ్చే స్వార్థాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు అనేక అంశాల్లో నష్టపోయారని, 11వ వేతన సంఘం సిఫార్సు సరిగా అమలు జరగలేదని అన్నారు. 2023 నాటికి నియమించాల్సిన 12వ వేతన సంఘం నియమించలేదని, బకాయిలు నేటికీ చెల్లించలేదని చెప్పారు. నిరుద్యోగులకు సంబంధించి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని, చంద్రబాబు అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిషికేషన్ హామీ నేటికీ నెరవేర్చుకోలేదని చెప్పారు. వీటితోపాటు అనేక సమస్యలున్నాయని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చట్టసభల్లో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

కృష్ణా- గుంటూరు జిల్లాల అభివృద్ధికి సంబంధించి శాసనమండలిలో, జిల్లా సమీక్ష, జిల్లా పరిషత్తు సమావేశాల్లో అనేక సార్లు ప్రత్యేకంగా ప్రస్తావించానని తెలిపారు. పల్నాడు జిల్లాకు వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం అత్యంత ప్రధానమైనదని, బొల్లాపల్లి మండల ప్రజలు గుక్కెడు తాగునీరు లేక పడుతున్న ఇబ్బందులను చట్టసభలో చర్చించామని అన్నారు. పల్నాడు జిల్లాలో విద్యాసంస్థలు ఏర్పాటుపైనా ప్రశ్నించామని, నిరంతరం ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ చట్టసభల్లో ప్రజా గళంగా ఉన్నామని తెలిపారు. కరోనా బారినపడి రాష్ట్రవ్యాప్తంగా 400 మంది ఉపాధ్యాయులు మరణించారని, వారి పిల్లలకు కారుణ్యమకం కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రత్యేకంగా కృషి చేశామని తెలిపారు. కరోనా సమయంలో 30 లక్షలు విరాళాలు సేకరించి 13 జిల్లాల్లో ప్రైవేటు ఉపాధ్యాయులను అదుకున్నామన్నారు. గత ప్రభుత్వం 117 జీవో తెస్తే దానికి వ్యతిరేకంగా పోరాటం చేశామన్నారు. 3, 4, 5 తరగతులు తరలించడానికి వ్యతిరేకిస్తూ పోరాటం చేసి ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు బడి కోసం బస్సుయాత్ర నిర్వహించగా ఆ విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. ప్రభుత్వాలు మంచి చేస్తే స్వాగతించామని, చెడు చేస్తే ప్రశ్నించి పోరాడామని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై ఉద్యమించిన తాను ఐదుసార్లు అరెస్టయ్యానని, జగన్మోహన్‌రెడ్డి పాలనలో అనేక కేసులు పెట్టారని, ఏడు సార్లు అరెస్ట్ అయ్యానని తెలిపారు. సిపిఎస్‌కు వ్యతిరేకంగా మహా ఉద్యమం చేశామన్నారు. వ్యక్తిగత విమర్శలకు తాము వ్యతిరేకమని, విధానపరంగా పిడిఎఫ్ ముందుకెళ్తుందని చెప్పారు.

ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కోడ్ అమలులో ఉండగానే ఈనెల 24న శాసనసభ సమావేశాలు జరపడం, గవర్నర్ ప్రసంగం అంటే ప్రభుత్వ విధానాలను తెలియపరచడమే కదా అని ప్రశ్నించారు. కోడ్ అమలు ఉన్న జిల్లాల్లో కూడా ఇటీవల యూనివర్సిటీలకు వీసీలను నియమించారని విమర్శించారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు సిహెచ్‌ఎన్‌ఎల్ మూర్తి, ప్రముఖ న్యాయవాది పిజె లూకా మాట్లాడుతూ అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజలకు అండగా నిలిచిన లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా, 370 ఆర్టికల్ వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని, రాజ్యాంగ విలువలు కాపాడుకోవాలంటే ఈనెల 27న జరిగే పోలింగ్‌లో లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సంపత్ కుమార్, ఉపాధ్యాయ సీనియర్ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, శివనాగరాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, రాష్ట్ర నాయకులు పి.ప్రేమ్‌కుమార్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు బి.సుబ్రహ్మణ్యం, ఎ.నాగేశ్వరరావు, జె.వి.వి వినుకొండ అధ్యక్షుడు జి.కమలారాం, సిఐటియు జిల్లా నాయకులు విజయకుమార్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో కెఎస్ లక్ష్మణరావు శనివారం పర్యటించారు. కోర్టు ప్రాంగణంలో లీగల్ సెల్ సభ్యులను, పెన్షనర్లను శ్రేయోభిలాషులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు కావస్తున్నా తొలి సంతకం చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మభ్యపెడుతోందన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, నిరుద్యోగ భృతి హామీని విస్మరించారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1.47 లక్షల పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై చట్టసభల్లో పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు 42 రోజుల పాటు సమ్మె చేయగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మద్దతు నిలిచారని చెప్పారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని మండలిలో ప్రస్తావించారని అన్నారు. వీరి ఒత్తిడికి ప్రభుత్వం స్పందించి మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. 18 ఏళ్ల నుండి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిస్వార్థంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తున్నారని, విభజన హామీలు అమలు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, రాష్ట్రాభివృద్ధి, ప్రత్యేక హోదాపై ఉద్యమాలకు మద్దతుగా ఉన్నారని చెప్పారు. ప్రజా సంఘాల నాయకులు కె.రామారావు, మోహనరావు, పి.ప్రేమ్‌కుమార్, కట్టా కోటేశ్వరరావు, ఈదర గోపీచంద్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు లక్షా 80 వేల మందితో పాటుగా ప్రైవేటు ఉపాధ్యాయులు సుమారు లక్షా 30 వేల మంది ఉన్నారని, ప్రైవేటు ఉపాధ్యాయులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం గుర్తింపు కార్డు, హెల్త్ కార్డులుతో పాటుగా ఉద్యోగ భద్రత కల్పించే విధంగా పోరాడుతానని కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము మాత్రం శాసన మండలి వేదికగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను చేసిన కృషిని చెప్పారు. ఈ కృషిని కొనసాగించేందుకు తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి నమూనా బ్యాలెట్‌ను ఆవిష్కరించారు.

# పేద విద్యార్థులకు భరోసాగా బాసట స్కాలర్‌షిప్

**ప్రజాశక్తి - యడ్లపాడు**



ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఇఒ, ఎస్ఐ

ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ విద్యార్థులకు విద్యా దీవెనగా నిలిచేలా 'బాసట' సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా చాలెంజ్ - స్కాలర్‌షిప్ టెస్ట్-2025ను స్థానిక లూథరన్ హైస్కూలులో శనివారం నిర్వహించారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు 304 మంది ఈ పరీక్ష హాజరవగా ప్రశ్నాపత్రాలను ఎంఇఒ ఎంవీ నాగరత్నం, ఎస్ఐ వి.బాలకృష్ణ ఆవిష్కరించారు. బాసట విద్యా కమిటీ కన్వీనర్ కల్లూరి శ్రీనివాసు (వాసు) మాట్లాడుతూ పేద విద్యార్థుల్లోని ప్రతిభను వెలుగులోకి రావడంతోపాటు వారికి ఉన్నత విద్యకు ఆర్థిక అండను అందించాలనే సంకల్పంతో ఈ పరీక్ష నిర్వహించామని చెప్పారు. బాసట ప్రధాన కార్యదర్శి సామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు సాయమందించేందుకు ముందుకొచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కారుచోల పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ టి.సుగంధరరావు మాట్లాడుతూ అవకాశాలు ఎప్పుడూ మనముందే ఉంటాఇయని, వాటిని ఉపయోగించుకోవడం మన చేతిలో ఉంటుందని విద్యార్థులకు చెప్పారు. సమర్థతకు పట్టుదల తోడైతే కలలు నిజమవుతాయన్నారు. కార్యక్రమానికి బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు అధ్యక్షత వహించగా లూథరన్ హైస్కూల్ హెచ్‌ఎం డాక్టర్ భవ్య తేజ, బాసట సంస్థ కోశాధికారి కేత రామబ్రహ్మం, సహాయ కార్యదర్శులు పోపూరి శ్రీనివాసరావు, ముత్తువరపు రవీంద్రబాబు, సభ్యులు చెరుకూరి సృజన, బచ్చు రాజేష్, సాగి వెంకటార్జున్, చెన్నుపాటి హనుమంతరావు, ముత్తువరపు కృష్ణమూర్తి, బందెల పీటర్, కోయ రామోజీరావు, చొంటినేని రంగారావు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతులు ఇలా..**

**విజేతలకు భారీ నగదు బహుమతులు**

**మొదటి స్థానం : రూ.50 వేలు**

**రెండో స్థానం : రూ.30 వేలు**

**మూడో స్థానం : రూ.20 వేలు**

**నాలుగో స్థానం : రూ.11 వేలు**

**ఐదో స్థానం : రూ.9 వేలు**

**మొదటి ముగ్గురికి ఎన్‌ఆర్‌ఐ ఆలోకం చంద్రశేఖర్, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన వారికి రావి సురేష్‌బాబు నగదును సమకూర్చారని నిర్వాహకులు తెలిపారు.**

# 1 ఓటు.. భవితకు మలుపు

- మన మంచి కోసం ఆలోచించే వారిని మేధావులు ఎన్నుకోవాలని విజ్ఞప్తి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ఓటు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు వేయాలని ప్రజాసంఘాలు పిలుపు



తెనాలి రూరల్

వ్యాపారులను కలిసి ప్రచారం

**ప్రజాశక్తి- తాడేపల్లి :** పీడీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు శనివారం తాడేపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ నమూనాలను చూపుతూ పట్టభద్రులను, ఉద్యోగులను, మేధావులను ఓట్లు అభ్యర్థించారు. లక్ష్మణరావు గెలుపు ద్వారా ఓ మంచి ఒరవడి సృష్టించాలని విజ్ఞప్తి చేశారు. ఎర్రగడ్డ, బొగ్గిళ్ల, ఎంహెచ్ కాలనీ, పాకిస్తాన్ ఏరియా ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ప్రజా సంఘాల నాయకులు వేముల దుర్గారావు, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఏ చెవిరి భర్తలో, బి ఏషియా, అనిల్, ఎన్.దుర్గారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అపార్ట్మెంట్లో ఓటర్లను కలిసి ప్రజాసంఘాల నాయకులు ఓట్ల అభ్యర్థించారు. రెయిన్‌బో విలాస్, గౌతమ్, నేతాజీ, కెవిఆర్ తదితర అపార్ట్మెంట్లలో ప్రచారం నిర్వహించారు. బోరుగ వెంకటేశ్వర్లు, దొంతి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, వై.బర్నబాస్ పాల్గొన్నారు.

**ఉండవల్లిలో జోరుగా ప్రచారం**

రాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలో జోరుగా ప్రచారం నిర్వహించారు. బాపనీయ నగర్, సాయి నగర్ ప్రాంతాల్లో ఓట్లు అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ఇతర వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిజాయితీతో ప్రజాపక్షంగా పనిచేస్తున్న లక్ష్మణరావు గెలుపు ప్రజా గెలుపుగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఇమ్మానియేల్ రాజు, సైకం వెంకటనారాయణ పాల్గొన్నారు.


తాడేపల్లిలో

**దుగ్గిరాల :** మండలంలోని ఈమని గ్రామం బీసీ, ఎస్సీ కాలనీల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మేధావులు, విజ్ఞానవంతులు ఆలోచించి లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, గిరీష్, సురేష్, వై.బాబూరావు పాల్గొన్నారు. మంచికలపూడి కేఆర్ కొండూరు గ్రామాల్లో లక్ష్మణరావుకు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వై.స్టాలిన్, పాములు ఎం.ఎస్.పాదం, శివ, ఆంజనేయులు పాల్గొన్నారు.

**ప్రశ్నించే వ్యక్తి..**


**మంగళగిరి :** ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ పాత మంగళగిరిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో ప్రశ్నించే లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వై.కమలాకర్, ఎం.చలపతిరావు, పి.బాలకృష్ణ, ఎస్.కోటేశ్వరావు, గోలి దుర్గాప్రసాద్, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

**పెదనందిపాడు:** మండలంలోని వరగానిలో పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఉద్యోగులు, ప్రజల సమస్యల మీద నిరంతరం మండలిలోనూ, ప్రజా వేదికలపై తన గళాన్ని వినిపించే లక్ష్మణ రావు కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు అభివృద్ధి, ఇతర సమస్యలపై చేస్తున్న ప్రజా పోరాటాలకు లక్ష్మణరావు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజల మనిషి గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొప్పలపూడి రమేష్, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


దుగ్గిరాలలో

**తెనాలిరూరల్ :** కూటమి ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెరగవు, వ్యాపారాలు వృద్ధి చెందుతాయన్న కల్లబొల్లి మాటలను నమ్మొద్దని వ్యాపారులకు రైతు సంఘం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి సూచించారు. మనందరి కోసం ఆలోచించే ప్రజల మనిషి లక్ష్మణరావుకు ఓటేసి గెలిపించాలని కోరారు. పట్టణంలో వ్యాపారులను కలసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. హెూటల్ వ్యాపారి మహమ్మద్ ముజార్, ఎం.ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ.. గతంతో పోల్చుకుంటే ఈ పాలనలో వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయని, అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.


తాడేపల్లిలో


పెదనందిపాడులో

# ప్రజల తరపున మాట్లాడేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే..

**ప్రజాశక్తి-మంగళగిరి**

పాలకవర్గాలేవైనా ప్రజల తరపున మాట్లాడేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలేనని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు అన్నారు. కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజవర్గం నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు ఓట్లేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరి ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రజా సంఘాల విస్తృత సమావేశం నిర్వహించారు. సిఐటియు నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలిచి శాసనమండలిలో అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి లక్ష్మణరావు కృషి చేశారని గుర్తు చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై నిరంతరం శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కారానికి తనవంతు సహకారం అందించారని తెలిపారు. రైతులు, చేతి వృత్తిదారులు, చేనేత కార్మికుల, కౌలు రైతుల సమస్యలను అనేక పర్యాయాలు ప్రస్తావించారన్నారు. మంగళగిరి ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం డీడీఆర్‌సీ సమావేశాల్లో గానీ, శాసనమండలిలో గానీ ప్రస్తావించినది లక్ష్మణరావేనని తెలిపారు.

కొద్దిరోజులుగా చేపడుతున్న ఎన్నికల ప్రచారంలో అన్ని వర్గాల నుంచి ఆయనకు విశేష మద్దతు లభిస్తోందని తెలిపారు. మేధావి వర్గాల మద్దతు తప్పక లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకూ గురికాకుండా లక్ష్మణరావుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు వీవీ జవహర్‌లాల్, ఈమని అప్పారావు, జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, వై.కమలాకర్, ఎం.బాలాజీ, ఎం.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు



## వర్సిటీకి పర్యావరణ విభాగం సేవలు కీలకం

**ప్రజాశక్తి - ఏఎన్‌యు**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రకృతి రమణీయతను పెంపొందించడంలో పర్యావరణ విభాగం సేవలు, సలహాలు అవసరం అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. పర్యావరణ విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్సిటీలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చిన్నచిన్న పక్షులను ఆకర్షించే విధంగా, వర్సిటీని రూపొందించడంలో పర్యావరణ విభాగ ఆచార్యులు తగిన పరిశోధనాత్మక సలహాలను అందించాలని కోరారు. రెండు రోజులుగా దేశం నలుమూలల నుంచి ఎంతోమంది పర్యావరణహితులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు ఎంతో విలువైన చర్చలు జరపడం అభినందనీయమని కొనియాడారు. సదస్సును విజయవంతం చేసిన ఆచార్యులను అభినందించారు. పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య స్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపే ఉద్దేశంతోనే ఇలాంటి సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సదస్సు సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీ మాట్లాడుతూ అవని ఆరోగ్యమే అందరి ఆరోగ్యమని, మనం పర్యావరణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అనంతరం పరిశోధక పత్రాలను సమర్పించిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారు.




## అపూర్వ సహోదరులు

**ప్రజాశక్తి-తెనాలి**

అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని శనివారం స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న తొమ్మిది జతల కవలలను ఒక వేదికపైకి తీసుకొచ్చారు. వారిని పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతా కాంత్ అభినందించారు. కవలల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఒకే పాఠశాలలో 9 జతల కవలలు ఉండటం గొప్ప అనుభూతిగా చెప్పారు.

## పది విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండలంలోని పేరేచర్ల యాపిల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇంగ్లీష్ ఫర్ యు ఇనిస్టిట్యూషన్ అకడమిక్ డైరెక్టర్ వి.వి.ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు భయపడే స్వభావం వదిలి.. ఎలా సన్నద్ధం అవ్వాలి అనే అంశం మీద వివరించారు. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ మండల స్థాయిలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎం.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## 'జీవుల పుట్టుక - మానవ పరిణామం' పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి - వినుకొండ**

జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య గౌరవాధ్యక్షులు, రచయిత కమలారామ్ సంక్షిప్తంగా రచించిన జీవుల పుట్టుక - మానవ పరిణామం బుక్‌లెట్‌ను శనివారం యుటిఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మానవ పరిణామం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలుపుతూ కమల రామ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు, జన విజ్ఞాన వేదిక నాయకులు, కవులు, కళాకారులు కమలా రామ్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పరాజు నాగేశ్వరరావు, సిహెచ్ రఘు, ఎం.రవిబాబు, భగవాన్ దాస్, లాయర్ మూర్తి, లాయర్ లూకా, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ

**ప్రజాశక్తి-నకరికల్లు**

గ్రామాలలో ప్రతి ఇంటి నుంచీ చెత్త సేకరణ చేసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్‌డీ కొమ్మవరపు శివప్రసాద్ సూచించారు. చెత్త సేకరణ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా శనివారం రూపేనగుంట్ల, దేచవరం గ్రామాలలో జరిగిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఇంటి నుంచి ఒక్కసారైనా చెత్త సేకరణంగా కచ్చితంగా చేపట్టాలని స్పష్టం చేశారు. వివరాలను పీఆర్ వన్ యాప్‌లో నమోదు చేసేలా ఎంపీడీవో జి.కాశయ్య సూచనల మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తెలియజేశామన్నారు.

## 'తొలి సంతకం చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు?'

**ప్రజాశక్తి - మాచర్ల**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని సిపిఐ మాచర్ల ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నర్రా రంగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ కొమెరా వీరాస్వామి భవన్‌లో శనివారం జరిగిన ఏఐవైఎఫ్ నాయకుల సమీక్ష సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టగానే డీఎస్సీపై తొలి సంతకం చేశారని, నేటికీ నోటిఫికేషన్ వెలువడలేకపోయారని తెలిపారు. నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయలు వెచ్చించి శిక్షణ పొందుతున్నారని చెప్పారు. నోటిఫికేషన్ ఎప్పుడోస్తుందో తెలియక అయోమయ పరిస్థితులలో అభ్యర్థులున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు బి.కిరణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.




# తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశంలోనే తొలి స్వాతంత్ర్య సమర యోధుడని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్ లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ రేనాటి వీరుడు నరసింహారెడ్డి పోరాటాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రథమ స్వతంత్ర సమరయోధుడిగా ప్రకటించి ఫొటోతో పోస్టల్ స్టాంప్ విడుదల చేసి ఆయన పోరాటాలకు గుర్తింపునిచ్చిందన్నారు. న్యాయవాది ఆరెకూటి



శ్రీనివాసరెడ్డి, యర్రంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టి. వీరారెడ్డి, లింగారెడ్డి, రమణారెడ్డి, పెద్దిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రామిరెడ్డి, వెంకట రెడ్డి, మోహన కష్ణారెడ్డి,టి. శ్రీనివాసరెడ్డి ,జీవి సాంబశివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని.. తద్వారా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని 2వ పట్టణ సిఐ హైమారావు ఆటోడ్రైవర్లకు సూచించారు. నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డు, కోట సెంటర్‌లో శనివారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు ఎస్.పి కె.శ్రీనివాసరావు, డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆటో స్టాండ్ లో నిర్దేశిత ప్రాంతంలో వాహనాలు నిలపాలన్నారు. పట్టణంలోని తిరిగే ఆటోలకు ట్రాఫిక్ పోలీసు సూచించిన పి.ఎస్ నెం. తప్పనిసరిగా ఉండాలన్నారు. పరిమితికి మించి



ప్రయాణికులను ఎక్కించరాదని, అధిక వేగం పనికిరాదని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం చట్ట రీత్యా నేరమన్నారు. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వినతి

**ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్**

అగ్రిగోల్డ్ ఆస్తులను రక్షించి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను యూనియన్ నాయకులు శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేతినేని అగస్టీన్ మాట్లాడుతూ సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధితుల సమస్యలను పరిష్కారించాలని, ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి, జప్తు చేసిన ఆస్తులన్నింటినీ కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలని కోరారు. జప్తు చేసిన ఆస్తుల రక్షణ బాధ్యతను సి.ఐ.డి. చీఫ్ పర్యవేక్షణలో మండల రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించి కాపాడాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల విషయంపై చర్చించి బడ్జెట్ కేటాయించి సత్వర న్యాయం చేయించాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లా వరికుంటపాడు అగ్రిగోల్డ్ పొలాల్లో ఎర్రచందనం, జామాయిల్ చెట్లను నరికి సుమారు 40 కోట్ల రూపాయల కలపను అమ్ముకున్న రాజకీయ పార్టీ నాయకులను వెంటనే అరెస్టు చేసి, వారి దగ్గర ఆ డబ్బులను రికవరీ చేయించాలన్నారు. వారు బాధితులపై దౌర్జన్యం చేయడాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా అగ్రిగోల్డ్




ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. సీఎం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ కరిముల్లా, సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, జగన్నాథం, కోటేశ్వరరావు, కొత్తూరి శ్రీనివాసరావు, కూరపాటి సుబ్బారాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాశక్తి-పెదకూరపాడు**

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్, యూఎస్ఏ) నేషనల్ కోఆర్డినేటర్ రామకృష్ణ బాలినేని అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని జి ఆర్ సి ఆర్ కె శ్రీచైతన్య స్పోర్ట్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో పల్నాడు జిల్లా స్థాయిలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో శనివారం ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.



ఆజాద్ చిత్రపటం వద్ద వైసీపీ నాయకుల నివాళులు

## అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులు

**ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్**

స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, మౌలాన అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పలుచోట్ల నిర్వహించారు. సత్తెనపల్లి రఘురాం నగర్ ప్రజా వేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ.. అబుల్ కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

**వైసీపీ కార్యాలయంలో...**

వైసీపీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొప్ప దేశభక్తుడు కన్నెగంటి

**ప్రజాశక్తి- మాచర్ల**



అడవి పుల్లరి శాసనాన్ని ధిక్కరించి అమరుడైన వీరుడు కన్నెగంటి హనుమంతు.. గొప్ప దేశభక్తుడని మాచర్ల మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ బస్టాండ్ సెంటర్లోని హనుమంతు విగ్రహానికి యరబోతుల శ్రీనివాసరావు పూలవేసి నివాళి అర్పించారు.

# జగన్ డ్రామాలు చాలు : జూలకంటి

**ప్రజాశక్తి - మాచర్ల**

ప్రజలు పదేపదే మోసపోరన్న విషయాన్ని జగన్ గుర్తించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలు వద్ద శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కోడి కత్తి, గులకరాయి డ్రామా, బాబాయి గొడ్డలిపోటు... ఇలా జగన్ ఇక నాటకాలు చాలు అన్నారు. మిర్చి రైతులను ఆదుకునేందుకు ఎగుమతుల అంశం, ఇతర విషయాలపై తాము కేంద్రంతో చర్చలు జరుపుతున్న విషయాలు తెలుసుకొని మిర్చి యార్డులో ఎన్నికల కోడ్‌లో జగన్ డ్రామ నడిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ 1.0తో రాష్ట్ర అభివృద్ధిని కుంగదీశారని, గత పాలనలో ప్రజలు పడ్డ ఇబ్బందులు మర్చిపోకముందే, మరోసారి 2.0 అంటూ హడావిడి ఏమిటని నిలదీశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసిన వైసీపీకి జనజీవన స్రవంతిలో ఉండేందుకు అర్హత లేదన్నారు. వారి శవ రాజకీయాలు, చౌకబారు ఆరోపణలు చూస్తే వారి మానసిక పరిస్థితులపై కూడా అనుమానాలున్నట్లు సందేహం వ్యక్తం చేశారు. రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి రైతుల సంక్షేమానికి రూ.7,500 కోట్లు కేటయించలేకపోయినట్లు వివరించారు. ధరల స్థిరీకరణ నిధి రూ.3,500 కోట్లు, ప్రకృతి వైపరీత్యాల నిధి రూ.4వేల కోట్లు ఏర్పాటు చేశావా? అంటూ నిలదీశారు. ఇంకా అధికారంలో ఉన్నామని భ్రమలో రౌడి రాజ్యం అమలు చేద్దామంటే చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసే నాయకులు ఉన్న విషయాన్ని వైసీపీ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో కూటమి నాయకులు వై.కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, మద్దిగపు చినవెంకటరామిరెడ్డి, సయ్యద్ ఆన్వర్‌బాషా, గుండాల శ్రీనివాసరావు, ఓర్సు క్రాంతికుమార్, మొహిద్దీన్, ప్రకాష్, మాచర్ల వాసు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**ప్రజాశక్తి- మాచర్ల రూరల్**

రుచి, నాణ్యతలో రాజీ పడకుండా ప్రజలకు ఆహారం అందివ్వాలని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్న క్యాంటీన్ నిర్వాహకులకు స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే జూలకంటి సందర్శించారు. ఆహార పదార్థాల రుచి, నాణ్యతపై ఆరా తీశారు. అక్కడి పరిసరాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ప్రజాశక్తి 7
గుంటూరు
ఆదివారం 23 ఫిబ్రవరి 2025

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ ను సత్తెనపల్లి ఎన్జీవో సభ్యులు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు . పదవ తరగతి చదువుతున్న 38 మంది విద్యార్థులకు ఎన్జీవో అసోసియేషన్ నాయకులు బొడ్డు రామారావు అతని సహచర మిత్రులు కలిసి పంపిణీ చేశారు. విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలకు అవసర మయ్యే ప్యాడ్, పెన్‌పెన్సిల్, రబ్బర్, షాప్నర్, ఇతర మెటీరియల్ ను, వేమన శతక పద్యాలు, భావాలు ఉన్న పుస్తకాన్ని చదువుకునేందుకు అర్థ భావాన్ని సులువుగా తెలుసుకునే విధంగా మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎన్జీవో నాయకులు

రామారావు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానానికి వెళ్లాలని కోరారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలకు దాతలు ఇచ్చిన సూచనలను చక్కగా పాటించి పరీక్షలు బాగా రాయాలని, ఈ పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు రామారావు వారి మిత్రబృందానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోట వెంకట శివ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం వారికి పరీక్ష మెటీరియలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో సత్తెనపల్లి ఎన్జీవో అసోసియేషన్ సభ్యులు కేబీఆర్ ప్రసాద్, ఎన్ లియోరాజ్, సత్తెనపల్లి సైదులు, అబ్దుల్ రజాక్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బేడెన్‌పావెల్‌కు నివాళి అర్పిస్తున్న స్కౌట్ విద్యార్థులు

## స్కౌట్‌లో చేరితే ఆరోగ్యం

ప్రజాశక్తి దుగ్గిరాల

స్కౌట్‌లో చేరితే సంఘ సేవలో పాలు పంచుకోవడంతో పాటు విద్యార్థులు శారీరకంగా ఆరోగ్యవంతంగా ఉంటారని స్కౌట్ టీచర్ కామాక్షి అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం స్కౌట్ వ్యవస్థాపకులు బేడెన్ పావెల్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి సాల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం శోభాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బుర్రకథ పితామహుడు నాజర్ వర్ధంతి

ప్రజాశక్తి తాడికొండ

బడుగు బలహీన వర్గాలను తన బుర్రకథల ద్వారా చైతన్య పరచిన షేక్ నాజర్ 28వ వర్ధంతి సందర్భంగా దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. బుర్రకథ పితామహుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత షేక్‌నాజర్ ఆశయాలను ప్రజలలోకి తీసుకు వెళ్లవలసిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో దూదేకుల సంఘ నాయకులు డి.నాగూర్ వలి, ఎస్ రాజ్‌కుమార్, షేక్ సర్దార్,షేక్ షరీఫ్, శ్రీనివాసరావు, షేక్ ఆదాము సాహెబ్, శాఖమూరి సాంబశివరావు గ్రామస్తులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న కార్మికులు

## 81వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 81 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వై రమాదేవి, ఈ చారమ్మ, ఎస్.కె ఇమాంబి, టి దుర్గా భవాని, కొప్పుల అంకమ్మ కూర్చున్నారు. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కార్మికుల స్థితిగతులను దృష్టిలో పెట్టుకునైనా పాలకులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఎం గురవయ్య, టి నాగేశ్వరరావు, కె.వి మోహన్‌రావు, ఇస్మాయిల్, వి.రిబ్కా, షేక్‌సుభాని, డి.రమణ, ఆర్ ఇజ్రాయిల్, ఎం శారద, ఎస్.కె ఆరిఫ్ పాల్గొన్నారు.

## నెహ్రూ నికేతన్‌లో ముగిసిన అకడమిక్ ఎక్స్‌పో

ప్రజాశక్తి తెనాలి

'రిఫ్లెక్షన్స్' పేరిట స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అకడమిక్ ఎక్స్‌పో శనివారంతో ముగిసింది. చివరి రోజున ఐదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలు తల్లిదండ్రులను, విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠ్యాంశాలకు సంబంధించి బుద్ధి బలం, తెలివైన ప్రశ్న, గొప్ప ధర్మాత్ముడు, చెట్లను పెంచండి-పర్యావరణాన్ని కాపాడండి వంటి లఘు నాటికల ప్రదర్శనలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళికాంత్ దాసరి మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా విద్యనభ్య సించడం, పోటీ పరీక్షలకు ధీటుగా వారిని తయారు చేసే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తు




వివిధ పాఠ్యాంశాల గురించి వివరిస్తున్న విద్యార్థులు

న్నట్లు చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతకాంత్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించండి

### జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ మాజీ చైర్ పర్సన్ పద్మశ్రీ శాంతా సిన్హా



డాక్టర్ శాంతా సిన్హాను సన్మానిస్తున్న అతిథులు


ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

దేశవ్యాప్తంగా వేళ్ళునుకున్న బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ మాజీ చైర్‌పర్సన్, పద్మశ్రీ శాంతా సిన్హాపిలుపునిచ్చారు. ఇందుకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన చట్టాలతో ముందుకు సాగాలని ఆమె సూచించారు. చదువుతోనే బాల కార్మిక వ్యవస్థకు విమోచన పేరిట ఏపీఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శనివారం ప్రత్యేక చర్చా గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాంతాసిన్హా ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. గడచిన 30 ఏళ్లుగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎంవీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న పోరాటాలను వివరించారు. నిరక్షరాస్యత, పేదరికం వల్లనే బాల కార్మికులు గణనీయంగా పెరుగుతున్నారని ఆమె పేర్కొన్నారు. విద్యావకాశాలను మెరుగుపరచడం, బడి బయటి పిల్లలకు ప్రత్యేక విద్యా సదుపాయాలు కల్పించడం ద్వారా బాల కార్మికుల సంఖ్యను తగ్గించవచ్చు అన్నారు. రాత్రి బడులు నిర్వహించడం, బ్రిడ్జి కోర్సుల సెంటర్లు ఏర్పాటు చేయడం వంటివి ప్రభుత్వాలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించి బాలకార్మిక రహిత సమాజ స్థాపనకు నడుంబించాలని కోరారు. ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతా సిన్హాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ డీన్ విష్ణు పద్, డాక్టర్ సీ వీ టామీ, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ తపా పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రికి సర్వీస్ మిషన్లు అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి సీతానగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఉండవల్లి పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులకు అవసరమైన సర్వీస్ మిషన్లు శనివారం అంద జేశారు. ట్రస్ట్ సభ్యుడైన మణికంఠ ఇందుకు ముందుకు వచ్చారు. బీపీ మిషన్, రోగి బరువు సరిచూసే మిషన్‌ను అందజేయటం పట్ల ట్రస్ట్ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ శాంతి, డాక్టర్ అనూష, సిహెచ్ఓ గురు కుమార్, యుడిసి హరి,



సర్వీస్ మెషీన్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆయుర్వేద వైద్యులు శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, స్టాఫ్ నర్స్ ఉమాదేవి, ట్రస్ట్ చైర్మన్ జొన్న రాజేష్, అంబటి తిరుపతిరావు, దినేష్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## రేపు వృత్తిదారుల జిల్లా సదస్సు

ప్రజాశక్తి మంగళగిరి

చేతి వత్తుల పరిరక్షణకు, వత్తి దారుల సంక్షేమానికి కార్పొరేషన్లకు నిధులు కేటాయించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న ఉదయం 10 గంటలకు మంగళగిరిలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చేతివృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. శనివారం మంగళగిరి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను చేతివృత్తులను ప్రోత్సహించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. నాగాంజనేయులు మాట్లాడుతూ సముద్ర సంపదను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కట్టబెడుతూ మత్స్యకారులు జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గీత పనివార్ల సంఘం నాయ కులు కంచర్ల కాశయ్య మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమ జివోలను అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో సిపిఐ మంగళగిరి నియోజకవర్గం కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి ఏ.ప్రభాకర్, ఏఐపియుసి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ పాల్గొన్నారు.




నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ

## 'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి తెనాలి

గతేడాది పదోతరగతి ఫలితాలలో ప్రతిభ చూపిన ఇరువురు విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ చేతుల మీదుగా నగదు బహుమతులను అందించారు. స్థానిక ఐతా నగర్ ఎన్ఎస్ఎస్ఎన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పి జయశ్రీ, ఎం అక్షయ గ్లోరీ గత ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుమ్మడి విజయ లక్ష్మి మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ గుమ్మడి సాంబశివరావు ఏర్పాటు చేసిన రూ.10వేల నగదును విద్యార్థినులకు అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు బి వెంకట్, సునీత, శారద, సంపూర్ణ, మనోజ్, ప్రసూనాదేవి వెంకట రమణ, నీలిమ ప్రశాంతి, రబియా పాల్గొన్నారు.

## గ్రామాలలో తడి, పొడి చెత్త సేకరణ

ప్రజాశక్తి -మేడికొండూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ దేశంలో ప్రకారం శనివారం మేడికొండూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త సేకరించారు. కార్యక్రమంలో భాగంగా పేరేచర్ల, డొకిపర్రు గ్రామ పంచాయతీలలో చెత్త సేకరణ కార్యక్రమానికి పర్య వేక్షణ అధికారిగా డివిజనల్ పంచాయతీ అధికారి కేశ్రీని వాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో విస్తరణాధికారి పిఆర్అండ్ ఆర్డి పూర్ణ శంకర్రావు పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు. విస్తరణ అధికారి పిఆర్అండ్ ఆర్డి పలువురు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

## టైలర్స్ డే వేడుకలకు అధికారులకు ఆహ్వానం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి ఈద్గా షాదీ మహల్‌లో ఈనెల 28వ తేదీన అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే టైలర్స్ డే వేడుకలకు హాజరుకావాలని కోరుతూ శనివారం అసోసియేషన్ నాయకులు స్థానిక అధికారులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. పట్టణ ఎస్ఐ రవీందర్ నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాషా, లేబర్ ఆఫీసర్ వీఎస్ఆర్ మూర్తిని వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యే టైలర్స్ డే వేడుకలకు నియోజకవర్గంలోని టైలర్స్ సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. అసోసి యేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నాగులమీరా, జంజనం వెంకట సాంబశివరావు, కోశాధికారి చాదరాసు పల్లిభాస్కర్ అధికారులకు ఆహ్వాన పత్రికలు అందజేసిన వారిలో ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి




ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ, నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజక వర్గానికి ఫిబ్రవరి 27న జరిగే పోలింగ్‌లో ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి పట్టభద్రుడు తప్పక ఓటును వేసి సద్విని యోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ కోరారు. శనివారం ఓటర్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్వీప్ ర్యాలీని జేసీ ఎ.భార్గవ్‌తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి హిందూ కళాశాల వరకు జరిగింది. అనంతరం హిందూ కాలేజి కూడలి వద్ద జేసీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జేసీ మీడియాతో మాట్లాడుతూ ఓటింగ్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల సహాయార్థం ఓటరు ఫెసిలిటీ సెంటర్లను కూడా ఏర్పాటు చేయడం జరిగినందున వాటిని ఉపయోగించుకోవాలన్నారు. డిఆర్ఒ ఖాజావలి మాట్లాడుతూ ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. గత 15 రోజుల నుండి ఓటర్లలో అవగాహన కల్పించేందుకు మండల కేంద్రాల్లో స్వీప్ యాక్టివిటీ నిర్వహించడం జరిగిందన్నారు.. ర్యాలీలో ఆర్‌డిఒ శ్రీనివాసరావు, జియంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, వెంకటకృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న హరిబాబు, రామారావు తదితరులు

## ఓవరాల్ ఛాంప్ చలపతి ఫార్మసీ

ప్రజాశక్తి - గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో రెండ్రోజులపాటు నిర్వహించిన మిలానోత్సవ్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. పోటీల అనంతరం ముగింపు కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డీన్ బి.హరిబాబు మాట్లాడుతూ గెలవాలనే తపన ఉంటే జీవితంలో ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా అధిగమించవచ్చని అన్నారు. అటువంటి తపన స్ఫూర్తి, ఒక్క క్రీడల ద్వారా పెంపొందించుకోవచ్చన్నారు. బలమైన దేహదారుఢ్యం ఉంటే బలమైన మేధాసంపత్తి ఉన్నట్లేనని అన్నారు. కావున ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలను కూడా ఆస్వాదించాలని చెప్పారు. విద్యార్థిదశ నుండే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే దీని ద్వారా మానసిక ఒత్తిడి దూరమవటమే కాకుండా ఏకాగ్రత, చురుకుదనం, జ్ఞాపకశక్తి పెరుగుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 16 కళాశాలల నుండి 534 మంది విద్యార్థులు వివిధ క్రీడలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను విన్నెర్స్‌గా చలపతి ఫార్మసీ కళాశాల, రన్నర్స్‌గా కెవిఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల గెలుపొందారు.




మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్

## సమిష్టి కృషితోనే సుందర చల్లపల్లి : డాక్టర్ డి.ఆర్.కె ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు : స్వచ్ఛ సుందర చల్లపల్లి అందరి విజయమని, స్వచ్ఛంద సేవకుల శ్రమ, సమయంతో ఈఘనత సాధ్యమైందని స్వచ్ఛ సుందర చల్లపల్లి శ్రమదాన ఉద్యమ వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఆర్.కె ప్రసాద్ అన్నారు. శనివారం జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛ సుందర చల్లపల్లి - ఉద్యమ అనుభవాలను పంచుకుందాం' కార్యక్రమానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి. లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ 2014 నవంబర్ 12వ తేదీన 15 మందితో పరిశుభ్రత, పచ్చదనం, సుందరీకరణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి లక్ష్యాలతో ప్రారంభమైన శ్రమదాన ఉద్యమం గడిచిన దశాబ్దకాలంలో సత్ఫలితాలను ఇచ్చిందని అన్నారు. ప్రతిరోజూ ఊరి కోసం వెచ్చించే గంటన్నర సమయంతో రహదారులు శుభ్రం చేయడం, కలుపు మొక్కలు తొలగించడం, గుంతలు తవ్వి మొక్కలు నాటడం, మొక్కల సంరక్షణ వంటి అనేక పనులు 'మనకోసం మనం ట్రస్ట్' సభ్యులు చేపడుతున్నారని తెలిపారు. గ్రామాన్ని బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చేందుకు స్వయంగా 70 మరుగుదొడ్లు నిర్మించామని, మరో 198 మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. డంపింగ్ యార్డులో వసతుల కల్పన, స్మశాన వాటికను పచ్చదనంతో నింపటం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ మనకోసం మనం ట్రస్ట్ సభ్యులను ఆదర్శంగా తీసుకొని ఎవరికి వారు తమ వీధులను, గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పచ్చదనంతో నింపాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలను ఏకత్రాటిపైకి తీసుకొచ్చి సమాజ శ్రేయస్సుకై కార్యక్రమాల రూపకల్పన చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్, మానవత అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు అల్లాబక్షు, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయరెడ్డి, స్టెప్ నేత ఎ.ధర్మారెడ్డి, డిబిఎఫ్ వ్యవస్థాపకులు కె.వినయ్‌కుమార్, రుద్ర చారిటబుల్ ట్రస్ట్ సుభాని, రేట్ ప్రేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ. నారాయణ రెడ్డి, అవగాహన కార్యదర్శి కె.శివరామి రెడ్డి తదితరులు ప్రసంగించారు.

# ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

### జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 71,528 మంది విద్యార్థులు : ఆర్ఐఒ జి.కె.జుబేర్



మాట్లాడుతున్న ఆర్ఐఒ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో మార్చి 1వ తేదీ నుండి జరిగే ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ విద్య ఆర్ఐఒ జి.కె.జుబేర్ తెలిపారు. శనివారం ఆర్ఐఒ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పరీక్షల వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 87 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 71,528 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 34, 473 మంది, ఒకేషనల్ 1,215 మంది ఉన్నారని చెప్పారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 34, 973 మంది, ఒకేషనల్ 867 మంది ఉన్నారని వివరించారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరుగుతుందని, ఉదయం 8.30 గంటల నుంచే కేంద్రంలోకి అనుమతిస్తారని అన్నారు. 9 గంటల తర్వాత అనుమతి ఉండదన్నారు. పరీక్షా కేంద్రాలను పరీక్ష తేదీకి ముందుగానే పరిశీలించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 16 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశామని ఆయా కేంద్రాల పరిధిలో ప్రతిరోజూ ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు 17 మంది కస్టోడియన్లు, రూట్ అధికారులు, పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తారని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్నపత్రం తెరిచే రూంతో పాటు ఆన్సర్ షీట్లను ప్యాక్ చేసే గదిలోనూ సీసీ కెమేరాలు ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పరీక్షల సరళిని ఆర్ఐవో కార్యాలయంతో పాటు ఇంటర్‌బోర్డు నుంచి ప్రత్యక్షంగా పరిశీలిస్తారని చెప్పారు అలాగే పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికి ఇంటర్‌బోర్డు హాల్‌టిక్కెట్లు జారీ చేసిందని, హాల్ టిక్కెట్లను బోర్డువైబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 95523 00009 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేసి విద్యాసేవలను ఎంపిక చేసుకొని, విద్యార్థి రోల్ నంబరు, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి హాల్ టిక్కెట్ పొందచ్చని సూచించారు. ఈవిధంగా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్లపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేకుండానే పరీక్షలకు హాజరు కావచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ సంతకం లేదనే కారణంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకుంటే సంబంధిత పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, శాఖాధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐవో హెచ్చరించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుదని, పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌ను నిరోధించేందుకు 4 ఫ్లయింగ్, 4 సిట్టింగ్ స్క్వాడ్‌లు నియమించామని చెప్పారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు, సందేహాల నివత్తికి ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబరు 0863-2228528కు ఫోన్ చేయాలని సూచించారు.

## జన నేతకు విశాల మద్ధతు

### కెఎస్ లక్ష్మణరావుకు పిటిఎల్ఎఫ్, అంబేద్కర్ యువజన సంఘం మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావుకు శనివారం పలు సంఘాలు మద్దతు తెలిపాయి. రాజకీయాలకు అతీతంగా లక్ష్మణరావును గెలిపించాలని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రసన్న ఒక ప్రకటనలో కోరారు. మన తరపున మన సమస్యల కోసం మాట్లాడే అభ్యర్థి లక్ష్మణరావుకు తమ సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికల్లో లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**అంబేద్కర్ యువజన సంఘం మద్దతు...**

విద్యావంతులైన పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలని ప్రజల కోసం పనిచేసే కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వీరాస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే ఎన్నికల్లో లక్ష్మణరావుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత ఇతర వర్గాల ప్రజలు మన కోసం పనిచేస్తుంది ఎవరో ఆలోచించాలన్నారు. వివిధ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కెఎస్ ముందుండి పోరాడుతున్నారన్నారు. మెగా డీఎస్‌సి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజల అభివృద్ధి కోసం మండలిలో, ఇతర జిల్లా వేదికలలో తన గళాన్ని వినిపిస్తున్నారన్నారు. అటువంటి అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును ప్రజలు అందరూ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# పంటలకు ధరల్లేక రైతుల గగ్గోలు




కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు పూర్తయింది. ఇంత వరకు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కదలిక లేదు. రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని, గిట్టుబాటు ధరలు కల్పిస్తామని ఇచ్చిన హామీల అమలుపై పట్టించుకున్న నాథుడు లేరు. పెట్టుబడి పెరిగి, ఉత్పత్తుల ధరలు తగ్గి రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్న చందంగా మారింది. ప్రభుత్వం నుంచి రైతులకు తగిన చేయూత కొరవడింది. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం, పిఎంకిసాన్ ద్వారా ఒక్కో రైతుకు రూ.20 వేల పరిహారం ఇస్తామని ఇచ్చిన హామీ వచ్చే ఖరీఫ్‌కు వాయిదా వేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఇచ్చే పిఎం కిసాన్ మూడో విడత ఈనెల 24న రూ.2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. కేంద్రం మూడు విడుతలుగా ఆరు వేలు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మిగతా 14 వేలు ఇవ్వడం లేదని రైతుల్లో అసంతృప్తి ఏర్పడింది.ఈ ఏడాది వివిధ రకాల పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. గత ఏడాది మిర్చి కనీస ధర రూ.18 వేలు,గరిష్ట ధర రూ.27 వేలు పలికింది. ఈ ఏడాది కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13వేలు మాత్రమే పలికింది. మిర్చి వ్యాపారుల మాయాజాలంలో రైతులు చిక్కుకుపోతున్నారు. ఈ దశలో మిర్చి లావాదేవీలపై ఆది నుంచి రాష్ట్ర ప్రభుత్వం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుందన్న విమర్శలు వచ్చాయి. తీరా మాజీ సిఎం జగన్ ఇటీవల మిర్చి యార్డు సందర్శించిన తరువాత ప్రభుత్వ వర్గాల్లో కదలిక వచ్చింది. ఈ అంశం వైసిపికి ప్లస్ పాయింట్ మారింది. అయితే వ్యాపారులు మాత్రం ఎగుమతులు లేవనే సాకుతో ధరలు తగ్గించారే తప్ప వచ్చిన సరుకును వచ్చినట్టు కొనుగోలు చేయడం వెనుక సిండికేట్ మంత్రాంగం పాత్ర ఉందనే ఆరోపణలు లేకపోలేదు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి రెండు నెలల తరువాత ఎక్కువ ధరకు అమ్ముకోవాలన్న పన్నాగం బాగా పారిందనే చెప్పాలి. ఈపరిస్థితుల్లో ప్రభుత్వం ఈ అంశంపై రెండు నెలల క్రితమే దృష్టిసారించి ఉంటే రైతులకు మేలు జరిగేది. పంట చేతికి వచ్చే సరికి అపరాల ధరలు నేలచూపులు చూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో అపరాల ధరలు గణనీయంగా తగ్గాయి. రాష్ట్రంలో ఉత్పత్తులు బాగున్నా ఇతర దేశాల నుంచి దిగుమతులతో శనగ, కంది ధరల పతనానికి దారితీసింది. ఆస్ట్రేలియా నుండి శనగ దిగుమతులు, మయన్మార్ నుండి కందుల దిగుమతి వల్ల ఉమ్మడి జిల్లాలో ఈ పంటలను సాగు చేసిన రైతులకు నష్టాలు మిగులుస్తున్నాయి. గత రెండు నెలల కాలంలో శనగ, కంది, మినుము, పెసర ఉత్పత్తులకు క్వింటాకు సగటున రూ.3 వేల వరకు ధర తగ్గింది. ఒక వైపు ధరలులేక మరో వైపు నానాటికి పెరిగిపోతున్న సాగువ్యయం వల్ల రైతులకు నిరాశ మిగులుతోంది. గత ఏడాది ఇదే రోజుల్లో కందులు క్వింటాలు రూ.10 నుంచి రూ.12 వేలు పలకగా ఈ ఏడాది ప్రస్తుతం రూ.6500 నుంచి రూ.7500 మాత్రమే పలుకుతోంది. మినుములు, పెసల ధరల పరిస్థితి కూడా గత ఏడాది, ఈ ఏడాది ఇదే పరిస్థితి కొనసాగుతోంది. శనగ ధరలు క్వింటాలు గత ఏడాది రూ.8 వేల వరకు పలకగా ఈఏడాది రూ.5 వేలకు తగ్గాయి. గరిష్టంగా అన్ని రకాల అపరాల ఉత్పత్తులకు క్వింటాలుకు రూ.3వేల వరకు తగ్గాయి. అయితే హోల్ సేల్ మార్కెట్‌లో కొంత ధరలు తగ్గినా రిటైల్ మార్కెట్‌లో ధరలు తగ్గడం లేదు. ధాన్యం కొనుగోలు విషయంలో కూడా ప్రభుత్వం రైతుల వద్ద కేవలం 15 శాతం ఉత్పత్తులు కూడా కొనుగోలు చేయలేదు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 12 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా కేవలం 1.30 లక్షల టన్నుల బియ్యంను కొనుగోలు చేశారు. అలాగే పత్తి సీజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సిసిఐ కొనుగోలు చేయక రైతులు అల్లాడిపోయారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జోక్యం చేసుకుని సిసిఐపై వత్తిడి తెచ్చిన తరువాత పరిస్థితి కొంత మెరుగుపడింది. ఈ ఏడాది అన్ని రకాల పంటలకు దిగుబడి తగ్గడం, అలాగే ధరలు లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)